క్లుప్తంగా

కొల్లేరు సరస్సును అభివృద్ధి చేయాలి

మండవల్లి: కొల్లేరు సరస్సు అభివృద్ధికి నిధులు కేటాయించి, పర్యావరణాన్ని కాపాడాలని ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు అన్నారు. స్థానిక గ్రంథాలయం వద్ద మంగళ వారం వారు మాట్లాడుతూ ఆక్రమణలతో కుచించుకుపోయి, పర్యావరణానికి తీవ్ర విఘాతం ఏర్పడుతుందని పేర్కొన్నారు. సరస్సులో రెగ్యులేటర్ నిర్మాణం చేపట్టి, సరస్సును పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు.

పాఠశాలకు కూలింగ్ వాటర్ ఫిల్టర్ వితరణ



కైకలూరు: పాఠశాలలో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న నలుగురు పూర్వ విద్యార్థులు ఓల్టాస్ కంపెనీ కూలింగ్ వాటర్ ఫిల్టర్‌ను వేమవరప్పాడు ఎంపీయూపీ స్కూల్‌కు వితరణగా మంగళవారం అందించారు. ఇక్కడ చదివిన జాజుల బాలాజీ (టీచర్), బోడావుల మల్లేశ్వరరావు (కానిస్టేబుల్), మువ్వల సురేష్ బాబు (ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ), బోడావుల వీరబాబు (టీచర్)ల ఆర్థిక సాయంతో స్కూల్ హెచ్ఎం చిట్టూరి చంద్రశేఖర్‌కు వాటర్ ఫిల్టర్ అందించారు.

ఎస్ఏ-1 పరీక్షలు ప్రారంభం



కూచిపూడి(మొవ్వ): సెప్టెంబర్ నాల్గో తేదీ వరకు జరిగే ఎస్ఏ-1 పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. సంస్కృతం ప్రధానంగా గత కూచిపూడి, పెదముత్తేవి పాఠశాలల్లో మంగళవారం నుంచి ప్రారంభమవ్వగా మిగిలిన పాఠశాలల్లో బుధవారం నుంచి ఈ పరీక్షలు ప్రారంభం కానున్నాయనని మండల విద్యాశాఖ అధికారి ఎస్.శివశంకర్ వెల్లడించారు. కాగా తొలి రోజు కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ పాఠశాల్లో జరుగుతున్న పరీక్షలను, మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ పరిశీలించారు. కూచిపూడి పాఠశాలలో 179 మంది, పెదముత్తేవిలో 99 మంది విద్యార్థులు సంస్కృతం పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

ఘర్షణ కేసులో నిందితుడికి రెండు నెలల జైలు

గుడివాడరూరల్: టూటౌన పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘర్షణ కేసులో నిందితుడికి రెండు నెలలు జైలు శిక్షను న్యాయమూర్తి మంగళవారం విధించారు. పోలీసులల కథనం మేరకు 2021లో టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘర్షణలో తనపై దాడి చేశారంటూ మేరుగుమాల శంకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు ఇటికల జోజిపై అప్పటి ఎస్ఐ కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి తుది విచారణ జరగగా ఫిర్యాదుదారుడి తరఫున ఏపీపీ సత్యవాణి కోర్టుకు వాదనలు వినిపించారు. నిందితుడు ఇటికల జోజిపై నేరం రుజువు కావడంతో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.సుధారాణి నిందితుడికి రెండు నెలల సాధారణ జైలు శిక్ష విధించారని టూటౌన్ పోలీసులు తెలిపారు.

క్రీడా దుస్తుల పంపిణీ



మండవల్లి: విద్యార్థి దశలోనే ప్రతిఒక్కరికీ క్రీడలపై ఆసక్తి కల్పించాలని దత్తాశ్రమ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గురుజాడ ఉదయ్‌శంకర్ అన్నారు. లోకుమూడి హైస్కూల్లో మంగళవారం గురజాడ ఉదయ్‌శంకర్, తలారి వెంకట రామారావు, కర్రేటి శివకృష్ణ ఆర్థిక సాయంతో తలారి రాజేష్, గడిదేశి విజయ్ కుమార్, హెచ్ఎం పి.వెంకటేశ్వరరావు సమక్షంలో క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ శాంతికల్యాణం



బంటుమిల్లి: మండల పరిధిలోని పెదతుమ్మిడి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ రుక్మిణి, సత్య సమేత కృష్ణ ఆలయంలో స్వామి వారి వార్షిక శాంతికల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణజన్మాష్టమి ఉత్సవాల్లో భాగంగా పలువురు దంపతులు దీక్ష ధారణలతో ఉదయం స్వామివారి ప్రధానమూర్తులకు అభిషేకాలు, పూజలు, హోమాలు అనంతరం శాంతికల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పెదతుమ్మిడి పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ప్రాణం పోసే వైద్యుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. కోల్‌కతాలోని ఆస్పత్రిలో రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్‌ను పాశవికంగా అత్యాచారం చేసి చంపడం దారుణం. నిందితులను చరిత్రలో మరిచిపోని విధంగా కఠినంగా శిక్షించాలి. ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులకు పూర్తి స్థాయిలో రక్షణ చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ సతీష్‌కుమార్, ప్రభుత్వ వైద్యుడు, గుడివాడ



వైద్యురాలిపై జరిగిన ఘటన అమానుషం



కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన దుర్ఘటన అమానుషం. ప్రజలను కాపాడేందుకు తమ ప్రాణాలను సైతం లెక్క చేయని ఎందరో మహనీయులు వైద్య రంగంలో ఉన్నారు. కరోనా సంక్షోభంలో ప్రజలను రక్షించేందుకు తమ ప్రాణాలను కూడా లెక్కచేయని త్యాగధనులు వైద్యులు. అలాంటి వైద్యులను కాపాడుకునే బాధ్యత ప్రభుత్వంతో పాటు సమాజానికి ఉంది.

– డాక్టర్ బి.శ్యామ్‌కుమార్, డెంటిస్ట్, సింగలూరు, గుడ్లవల్లేరు మండలం

విషసర్పాల స్థావరాలుగా ఖాళీ స్థలాలు

- పందులు, దోమలకు నిలయాలుగా ప్రదేశాలు
- ఆందోళనలో జగన్నాథపురం వాసులు



రెడ్డిగారి మిల్లు సందు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో పెరిగిన చెట్లు

గుడివాడరూరల్: పట్టణంలో ఏళ్ల తరబడి ఖాళీగా ఉంటున్న పలు స్థలాలు అడవులను తలపిస్తున్నాయి. పెద్ద చెట్లు, ముళ్ల కంచెలు, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. విషసర్పాలు, దోమలు, పందులు ఖాళీ స్థలాల్లో తిష్టవేసి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో లేదా వ్యాధులు ప్రబలుతోయోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పట్టణంలోని జగన్నాథపురంలోని పలు ప్రాంతాల్లో ఎటు చూసినా ఖాళీ స్థలాలు దర్శనమిస్తున్నాయి. ఏళ్ల తరబడి ఖాళీగా ఉండటంతో పెద్ద చెట్లు, పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లతో నిండిపోయాయి. ముఖ్యంగా ప్రభుత్వ జెడ్పీ అతిథి గృహం ఆనుకుని, వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిలో మరో మూడు స్థలాలు ఇదే మాదిరిగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఖాళీ స్థలాల్లో చెట్లు దట్టంగా పెరిగి అడవులను తలపిస్తున్నాయి.

ప్రజల బెంబేలు

ఖాళీ స్థలాలు చిట్టి అడవులుగా మారడంతో భయంకరమైన విషసర్పాలు, వ్యాధులు కలిగించే దోమలు, పందులు, హాని కలిగించే పురుగులకు ఆవాసాలుగా మారాయి. విచ్చలవిడిగా విషసర్పాలు రాత్రి, పగలు లేకుండా సంచరిస్తుండటంతో పరిసర ప్రాంతాల్లో నివాసముండేవారు బెంబేలెత్తుతున్నారు. ముఖ్యంగా ప్రముఖ దేవాలయంతో పాటు పలు పాఠశాలలకు ఈ ప్రాంతం నుంచే రోజువారీ ప్రయాణాలు సాగిస్తుంటారు. చీకటి పడితే ఏ ప్రమాదం ఎటువైపు నుంచి వస్తుందో తెలియక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పట్టణంలో డెంగీ, మలేరియా, విషజ్వరాలు విజృంభిస్తుండటంతో రాత్రి, పగలు లేకుండా దోమలు ఎక్కువ కావడం, పందులు ఇష్టారాజ్యంగా సంచరిస్తుండటంతో ఏ వ్యాధులు వస్తాయోననే భయంతో ప్రజలు వణికిపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, పొదలు పెరగకుండా ఎప్పటికప్పుడు స్థల యజమానులు వాటిని శుభ్రం చేసుకోవాల్సి ఉంది. యజమానులు శుభ్రం చేసుకునే విధంగా మున్సిపల్ అధికారులు పర్యవేక్షించి, నిబంధనలు పాటించని స్థలాలను మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే అధికారులు ఖాళీ స్థలాల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఫలితంగా స్థలాలు చిట్టడవులుగా మారి పరిసర ప్రాంత ప్రజలకు సంకటంగా మారాయి. మున్సిపల్ అధికారులకు స్థలాలను శుభ్రం చేయాలని స్థానిక ప్రజలు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై జిల్లా స్థాయి అధికారులు, పాలకులు స్పందించి ఖాళీ స్థలాలను శుభ్రం చేసే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు పక్కన చిట్టి అడవిని తలపిస్తున్న ఖాళీ స్థలం



ప్రభుత్వ జెడ్పీ గృహం పక్కన విషసర్పాలకు ఆవాసంగా మారిన భవనం

భయమేస్తోంది



జగన్నాథపురంలోని ఓ షాపులో పని చేస్తున్నా. ఆ షాపునకు అన్ని వైపులా ఖాళీ స్థలాలు ఉన్నాయి. వాటిలో పిచ్చి మొక్కలు పెరిగిపోయి ఉన్నాయి. ప్రతి రోజూ పొదల్లో నుంచి విషసర్పాలు బయటకు వచ్చి తిరుగుతున్నాయి. రాత్రి అయితే ఎప్పుడు ఏ పాము కాటు వేస్తుందోనని భయమేస్తోంది.

– సీహెచ్ పవన్, గుడివాడ

దోమలతో నరకయాతన



మేము నివాసముంటున్న పక్కనే పెద్ద ఖాళీ స్థలం ఉంది. స్థలాన్ని శుభ్రం చేయకపోవడంతో పుట్టలు, చెట్లకు ఆవాసంగా మారింది. ఖాళీ స్థలంలో రోజూ పందులు సంచరిస్తున్నాయి. దోమలు రాత్రి, పగలు తేడా లేకుండా కుట్టేస్తున్నాయి. ఎప్పుడు ఏ వ్యాధుల బారిన పడతామో తెలియక నరకయాతన అనుభవిస్తున్నాం. స్థలాలు శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులను వేడుకున్నా ఫలితం లేదు. సమస్యను వెంటనే పరిష్కరించాలి.

– ఎం.నాగరాజు, జగన్నాథపురం గుడివాడ

స్థల యజమానులకు నోటీసులు ఇస్తాం

పట్టణంలోని అన్ని వార్డుల్లో ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి, వాటికి సంబంధించిన యజమానులకు నోటీసులు ఇచ్చేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. చాలా ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. వీటిని స్థల యజమానులు వీలైనంత త్వరగా తొలగించేలా చర్యలు చేపడతాం. నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా స్థల యజమానులు స్పందించకపోతే తామే సిబ్బందితో తొలగింపు పనులు చేపట్టి వాటికి సంబంధించిన సొమ్మును రికవరీ చేస్తాం.

– బి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్, గుడివాడ

ఘనంగా ఉట్టి మహోత్సవం



పామర్రులో ఉట్టి కొడుతున్న చిన్నారులు



గుడివాడలో స్వామికి ప్రసాదాలు సమర్పిస్తున్న భక్తులు



వడాలి జగన్నాథస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అడ్డాడ(పామర్రు): పామర్రు మండలం అడ్డాడ గ్రామంలో అరవింద హైస్కూల్లో అష్టమి తిథి రోహిణీ నక్షత్రం ప్రధానంగా మంగళవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు రాధా సమేత కృష్ణులుగా వేషధారణలతో అలరించారు. సాయంత్రం వైస్ ప్రిన్సిపాల్ పీ మోహన ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహిచారు. చిన్నారులు ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొని ఉట్టిని కొట్టారు. కార్యక్రమంలో పి.ప్రసన్నకుమారి, ఎం.తనూజ పాల్గొన్నారు.

పామర్రులో..

స్థానిక విష్ణాలయంలో కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు గోపిక, కృష్ణుల వేషధారణలో ఉట్టిని కొట్టారు. ఉట్టిని కొట్టిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ కందుల వెంకటరెడ్డి, సిబ్బంది కె.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటిమీద వేంచేసియున్న శ్రీ భూనీలా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీకృష్ణుని విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. 54 ప్రసాదాలు స్వామికి నివేదికగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని 52 భక్తి కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదాంతం అప్పలాచార్యులు మాట్లాడుతూ తిథి, నక్షత్రాల ప్రకారం కృష్ణాష్టమి వేడుకలు మంగళవారం నిర్వహించామని తెలిపారు. ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం, సీహెచ్ ఇందిరా రమణారావు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు రెండో రోజైన మంగళవారం ఘనంగా నిర్వహించారు. రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయంలో వేడుకలను నిర్వహించారు. మహిళల మురళీకోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. వేడుకలను ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

వికసిత్ ఆంధ్ర లక్ష్యాలను సాధించాలి



వికసిత్ ఆంధ్ర వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఏఓ గణేషరెడ్డి

పమిడిముక్కల: వికసిత్ ఆంధ్ర లక్ష్యాలను సాధించాలని ఎంపీడీఓ చీలి విఠల్‌పాల్ పేర్కొన్నారు. అన్ని శాఖలు ప్రతి సంవత్సరం 15 శాతం ఆర్థికాభివృద్ధి సాధించాలని తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వికసిత్ ఆంధ్ర 2047పై మండల స్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. విద్యా, వైద్య, వ్యవసాయ, పశుసంవర్థక, పంచాయతీరాజ్ శాఖల్లో సాధించాల్సిన లక్ష్యాలపై చర్చించారు. వ్యవసాయరంగంలో అధిక దిగుబడులు సాధించాలని, మేలుజాతి పశువుల పెంపకం ద్వారా అధిక పాలదిగుబడి సాధించాలని, మాతా,శిశు మరణాలను తగ్గించాలని, బడిబయట విద్యార్థులు లేకుండా చూడాలని, పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని లక్ష్యాలను నిర్దేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, ఏఓ గణేష్‌రెడ్డి, వెటర్నరీ డాక్టర్ వెంకటేష్, ఏఓ రామకృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047పై వర్క్‌షాప్‌ను ఎంపీడీఓ జి.సుధాప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించారు. రానున్న ఐదు సంవత్సరాల్లో వృద్ధి రేటు పెంపొందించేందుకు, ఉత్పత్తి పెరుగుదల, విలువల జోడింపు, వినూతన విధానాలు తదితర అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. మొత్తం 39 శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించగా డీటీ కే శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ వీర్ల సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

దేవతామూర్తుల గ్రామోత్సవం



దేవతామూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

జమీదగ్గుమిల్లి(పామర్రు): మండలంలోని జమీదగ్గుమిల్లి గ్రామంలో గంగానమ్మతల్లి ఆలయ పునఃప్రతిష్టా మహోత్సవంలో భాగంగా మంగళవారం దేవతామూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత ఆలయంలో ఉదయం గణపతి పూజ, అగ్ని ప్రతిష్టాపన, ప్రధానమూర్తి హోమం, క్షీరాధివాసం నిర్వహించారు. ఈ సందర్భంగా 108 బిందెలతో దేవతామూర్తులకు జలాభిషేకాలను మహిళలు నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి గంగానమ్మ అమ్మవారు, వినాయక, నాగబంధం, పోతురాజు దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగించారు.

నేడు విగ్రహాల ప్రతిష్ట

దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం బుధవారం ఉదయం 9.10 గంటలకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం భక్తులందరికీ అన్న సమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

క్రీడా పోటీల్లో లింగారెడ్డిపాలెం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పీఈటీ

కోడూరు: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవనిగడ్డ సబ్‌జోన్ పరిధిలో నిర్వహించిన ఆటల పోటీల్లో లింగారెడ్డిపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అథ్లెటిక్స్ విభాగంలో బాలికలు సత్తా చాటారు. తొమ్మిదవ తరగతికి చెందిన పి.మధుప్రియ షార్ట్ పుట్‌లో ప్రథమ స్థానం, డిస్క్ త్రో, లాంగ్‌జంప్, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయస్థానం కైవసం చేసుకుంది.

అదే తరగతికి చెందిన బి.దివ్య 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, పి.లావణ్య మూడవ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ బీపీఎల్ ప్రసాద్‌ను ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు అభినందించారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలిపివేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ టౌన్: వ్యవసాయ పంప్ సెట్లకు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సూచనలతో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయించిందని, అప్పట్లో దీనిని పూర్తిగా వ్యతిరేకించిన టీడీపీ నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఒప్పందాన్ని రద్దు చేయక పోగా స్మార్ట్ మీటర్ల ప్రక్రియ కొనసాగించడం దారుణమన్నారు. విజయవాడ తదితర ప్రాంతాలకు ఇప్పటికే స్మార్ట్ మీటర్లు తరలించి భద్రపర్చారన్నారు. వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లు బిగించిన అనంతరం ఉచిత విద్యుత్‌కు మంగళం పాడతారన్నారు. అందువల్ల వెంటనే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను నిలుపుదల చెయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం మండల కమిటీ సభ్యురాలు పి. రజిని, నారాయణ పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి విశేష పూజలు



పామర్రు: స్థానిక ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాసం మంగళవారం పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజలు చేశారు. తొలుత ఆలయంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పలువురు భక్తులు ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్లను వండి స్వామికి సమర్పించారు. ఆలయంలో పూజలను అర్చకులు రామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సహాయకులుగా శర్మ, ఫణి వ్యవహరించారు. ఆలయ ఇన్‌చార్జి ఈఓ సుధాకర్ పాల్గొన్నారు.

వర్క్ ఎడ్జెస్ట్‌మెంట్‌లో సాంకేతిక లోపాలు



వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుడివాడ టౌన్: ఈ విద్యా సంవత్సరం జరుగుచున్న వర్క్ ఎడ్జెస్ట్‌మెంట్ విధానంలో సాంకేతిక లోపాలు వచ్చాయని యూటీఎఫ్ కృష్ణా జిల్లా నాయకులు ఆరోపించారు. వీటిని సరిచేసి కొత్త జాబితాను తయారు చేయాలని కోరుతూ మంగళవారం విద్యాశాఖ డివిజినల్ అధికారి (డీవైఈఓ) కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ర్యాంక్ లేదా మెరిట్ కం రోస్టర్ ప్రకారం జాబితాలు తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నీలం ప్రభాకరరావు, పట్టణ కార్యదర్శి కె.సతీష్‌కుమార్, అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, మురళి, బాషా, రాజేష్ పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకాలు చేయించుకునేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. పాల పొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసి, స్వామికి సమర్పించారు. ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో సుబ్బారాయుడికి ఈ అభిషేకాలు నిర్వహించారు.

పీఎఫ్, ఈఎస్ఐ అవకతవకలపై నేడు విచారణ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ అవకతవకలపై విచారించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. మూడేళ్లుగా ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, ఏడాదిగా మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల జీతాల నుంచి మినహాయిస్తున్న పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ములు కార్మికుల ఖాతాల్లో జమ కాకపోవడాన్ని నిరసిస్తూ అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ఇటీవల నిరవధిక సమ్మెకు నోటీసులు ఇచ్చింది. ఈ నోటీస్ ప్రకారం సెప్టెంబర్ 4వ తేదీ నుంచి జీజీహెచ్, ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో పనిచేస్తున్న కార్మికులు నిరవధిక సమ్మెకు సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కుంపటి జయకర్‌బాబు, యూనియన్ నాయకులు, సభ్యులు జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారిని కలిసి వారికి జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. దీనిపై సుందరాచారితో పాటు జీజీహెచ్ డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆర్ఎంఓ డాక్టర్ నిరంజన్‌కుమార్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఉష, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌తో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా రోజు రోజుకి ముదురుతున్న పీఎఫ్, ఈఎస్ఐ అవకతవకలపై సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీతో ప్రత్యక్ష విచారణ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 28వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు శానిటేషన్ కాంట్రాక్టు సంస్థ అయిన ఫస్ట్ ఆబ్జెక్ట్ ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధులు జీజీహెచ్‌లో జరిగే విచారణకు హాజరు కావాలని అధికారులు ఆదేశించారు.

ఎయిడ్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవీంద్రబాబు

గుడివాడ టౌన్: విద్యార్థి దశ నుంచే ప్రాణాంతకమైన ఎయిడ్స్ వంటి వ్యాధులపై అవగాహన కలిగి ఉంటే యువత వాటికి దూరంగా ఉంటారని గుడివాడ ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రబాబు అన్నారు. కళాశాల్లో అంకిత స్వచ్ఛంద సంస్థ మంగళవారం ఏర్పాటు చేసిన ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆవేశంలో అవగాహన కోల్పోయి వ్యవహరించడంతో జరిగే అపాయాలు ఎయిడ్స్ వంటి వ్యాధులకు దారి తీస్తాయన్నారు. వ్యాధి ఎలా వ్యాప్తి చెందుతుంది, అందుకు గల కారణాలు, నియంత్రించే అంశాలు, సూత్రాలు తెలిసి ఉండటంతో యువత వాటికి దూరంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంకిత ప్రతినిధులు పాల్గొన్నారు.